అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



కల్లూరులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: అవినీతికి తావు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం పాతకల్లూరు, ఎగువపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా ప్రజలందరికీ తోడుగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలవాలన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడా చూడాలన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా గతంలో మాదిరిగా కాకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. ఓటమి భయంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు ఓర్వలేక ప్రతిపక్షం ఆరోపణలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, పాలి ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు బృందావన్ రామాంజనేయులు, కేశవయ్య, చితంబరరెడ్డి, నాగార్జున, మాబు, కొండాయాదవ్, లాలెప్ప, రవి, నాగార్జున, రామ్మోహన్, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోండి



డీఆర్ఎంకు సమస్యలు తెలియజేస్తున్న నాయకులు

గుంతకల్లు రూరల్: గుత్తి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ గుత్తి నాయకులు శుక్రవారం డీఆర్ఎం మనీష్ అగర్వాల్ కోరారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎంను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి రైల్వేస్టేషన్‌లో రైళ్లు ఆపడం లేదని, స్టేషన్‌లో ఒక లిఫ్టు మాత్రమే పనిచేస్తోందని తెలియజేశారు. కార్యక్రమంలో గుత్తి పట్టణ కన్వీనర్ హుస్సేన్ పీరా, జీఎం బాషా, రంగనాయకులు, చెన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్కీడిప్ విజేతలకు బహుమతుల అందజేత



విజేతకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ డీఎం, అసిస్టెంట్ డీఎం

తాడిపత్రి అర్బన్: ఆర్టీసీ లక్కీడిప్‌లో ఎంపికైన విజేతలకు శుక్రవారం బహుమతులను పంపిణీ చేశారు. తాడిపత్రి–ధర్మవరం రూటు ప్రయాణికులకు ఇటీవల ఆర్టీసీ లక్కీడిప్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సమక్షంలో డీఎం శంకర్, అసిస్టెంట్ మేనేజర్ నందిని సమక్షంలో లక్కీ డిప్ తీయగా ఇ.పద్మావతి, లలిత, మనీషా ఎంపికయ్యారు. వీరికి బహుమతులు అందజేశారు.

క్రిమి సంహారక మందులు అతిగా వాడొద్దు

గుంతకల్లు రూరల్: మిర్చి సాగులో క్రిమిసంహారక మందులు ఎక్కువ మోతాదులో వాడొద్దని జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ రఘునాథ్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవితో కలిసి జీ.కొట్టాలలో సోలార్ కోల్డ్ స్టోరేజీ రూమును పరిశీలించారు. అనంతరం తిమ్మాపురంలో మిర్చి, గుత్తి మండలం రజాపురంలో చీనీ పంటను పరిశీలించారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయించండి



బీఎల్ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాలమ్మ

యాడికి: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయించాలని తహసీల్దార్ బాలమ్మ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4, 5 తేదీల్లో రెండు రోజులు మండలంలోని 55 పోలింగ్ స్టేషన్ల వద్ద స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించాలని, ఇందులో వచ్చిన క్లెయిమ్‌లను బీఎల్ఓలు యాప్‌లో అక్కడే ఎంట్రీ చేసి వాటిని తిరిగి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటును ముమ్మరం చేయాలన్నారు. మండలంలోని 55 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సదుపాయాల వివరాలను తెలపాలన్నారు. ఆర్ఐ ఆనందబాబు ఆచారి, వీఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



మృతుడు నాగరాజు

గార్లదిన్నె: పెనకచెర్లలో శుక్రవారం ఓ రైతు పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దాసరి నాగరాజు (60)కు 2.34 ఎకరాల భూమి ఉంది. పంటల సాగు కోసం అప్పులు చేసి పొలంలో నాలుగు బోర్లు వేశాడు. దాదాపు 400 చీనీ చెట్లు సాగు చేశాడు. చీనీ పంట పండక పోవడంతో ఉన్న చెట్లు కూడా తొలగించేసి ప్రస్తుతం కంది సాగు చేశాడు. పంటలు పెట్టుబడి కోసం దాదాపు రూ. 8 లక్షలు అప్పులు చేయడంతో వాటిని తీర్చలేక మదన పడుతూ ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లక్ష్మిదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైద్య శిబిరం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం గుంతకల్లు రైల్వే ఆసుపత్రి, గుత్తి రైల్వే హెల్త్ యూనిట్ సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించారు. రైల్వే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు హెల్త్ క్యాంప్‌కు వచ్చారు. వైద్యులు ప్రభావతి, సుధీర్, విజయలక్ష్మి, మురళీ మోహన్ కార్మికులు, రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సికింద్రాబాద్ డిప్యూటీ సీపీఓ ప్రేమ్‌కుమార్, సీనియర్ డీపీఓ చౌహాన్, గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ రవికుమార్, చైర్మన్ ప్రమోద్, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు సుంకిరెడ్డి

గుంతకల్లు రూరల్: గుంతకల్లు సహకార బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు సుంకిరెడ్డి సూచించారు. శుక్రవారం బ్యాంకులో ఘర్ ఘర్ కేసీసీ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖాతాదారులకు, రైతులకు బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల సేవలను వివరించడంతోపాటు, బ్యాంకు సాధించిన అభివృద్ధిని వివరించారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ భవానీ, వీసీలు నైరుతి, మైమూన్

గుంతకల్లుటౌన్: నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో పేదరికం పూర్తిస్థాయిలో నిర్మూలన జరగాలన్నా, అభివృద్ధి పరుగులు తీయాలన్నా మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ కె.నీలావతితో కలిసి వారు ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో పలు చోట్ల డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరగా, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించాలని వారు అధికారులకు సూచించారు. గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి గురించి ఆరా తీశారు. వార్డు వలంటీర్లు, కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ యువనేత సిబి.మంజునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వార్డు ఇన్‌చార్జ్ మార్కెట్ వెంకటేష్, మాజీ చైర్మన్లు రామలింగప్ప, రామాంజనేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ హొన్నూర్‌వలి, కౌన్సిలర్లు మహాలక్ష్మి, మెహరున్నీసా, నాగరత్నమ్మ, చెన్నమ్మ, సుధాకర్, రవి, వార్డు ఇన్‌చార్జ్‌లు వీరేష్, యూనస్, శ్రీనివాసులు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎండీ.ఖలీల్ పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సొంతింటి కల సాకారమవుతోందని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పి.కొత్తపల్లిలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అధికారంలోకి వచ్చాక ప్రతి పేదోని ముఖంలో చిరునవ్వు చూడాలనే లక్ష్యంతో నవరత్నాల పథకం కింద పేదలకు ఇంటి పట్టాతో పాటు ఇళ్లను మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ అనుచరులకు, కార్యకర్తలకు మాత్రమే ఇళ్లను మంజూరు చేసేవారన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎవరి ప్రమేయం లేకుండా వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి పట్టాతో పాటు ఇంటిని మంజూరు చేస్తున్నారన్నారు. ఈ పక్రియ నిరంతరంగా కొనసాగుతోందన్నారు. జెడ్పీటీసీ భాస్కర్, సీనియర్ నేతలు ఆలూరి రమణారెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎంపీడీఓ తేజోత్స్న, మండల కన్వీనర్ అంకే నరేష్, జేసీఎస్ కన్వీనర్ బయపరెడ్డి, బీకేఎస్, చెదుల్ల సర్పంచులు పార్వతి, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, నీలం భాస్కర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



గన్నేవారిపల్లిలో వృద్ధుడితో మాట్లాడుతున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. వీరాపురం, హుస్సేనాపురం, గన్నేవారిపల్లిలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ గ్రామ సమస్యలపై ఆరా తీశారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుకోవాలంటే నాయకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. కానీ నేడు ఆపరిస్థితి లేదన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా నేరుగా ఇళ్ల వద్దే అందుతున్నాయన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి ని చేసుకుందాం అని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, జావీద్, ఎంపీటీసీ రవికుమార్, పట్టణ యువజన నాయకుడు ప్రదీప్‌రెడ్డి, వరలక్ష్మీ, లక్ష్మీనారాయణరెడ్డి, శివారెడ్డి, వెంకటరమణ, పుల్లయ్య, కాకర్ల జగనాథ్, ప్రసాద్, శంకర్, పెద్దయ్య, బాలకృష్ణ, వెంకటరాముడు, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి



సీఐ నాగార్జునరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేతపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ కాటమయ్య, జెడ్పీటీసీ భాస్కర్ శుక్రవారం సీఐ నాగార్జునరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు బాబయ్య రెండు పార్టీల మధ్య రెచ్చగొట్టే చిచ్చు రేపేలా సీఎం వైఎస్ జగన్‌పై తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ఆ వీడియోను సోషల్ మీడియాల్లో వైరల్ చేశాడన్నారు. టీడీపీ నాయకునిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు చికెన్ నారాయణస్వామి, గంగరాజు, మాబు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ‘అమ్మ’ చేయూత



బేల్దారి వీరన్న కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

శింగనమల: మండల కేంద్రానికి చెందిన బేల్దారి వీరన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, తల్లి ఉన్నారు. కుటుంబ యజమాని మరణంతో అతని కుటుంబం వీధిన పడింది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శింగనమలకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వీరికి రూ.40 వేలు ఆర్థిక సాయం, కుటుంబ జీవనోపాధికోసం కుట్టు మిషన్, నిత్యావసర సరుకులు, బియ్యం, దుస్తులు అందించారు. పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా వారికి సహకారం అందిస్తామని అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి భరోసా కల్పించారు.

‘ప్రిన్సిపాల్‌ను మార్చే వరకు క్లాసులకు వెళ్లం’



ధర్నా చేస్తున్న విద్యార్థినులు

గుత్తి: ప్రిన్సిపాల్‌ను మార్చే వరకూ తరగతులకు వెళ్లమంటూ ప్రభుత్వ బాలికల జూనియర్ విద్యార్థినులు కళాశాలలో ఆందోళనకు దిగారు. శుక్రవారం మరోసారి ప్రిన్సిపాల్ సంజీత్ నాయక్ లెక్చరర్లు, విద్యార్థుల పట్ల విచిత్రంగా ప్రవర్తించాడు. దీంతో లెక్చరర్లు, విద్యార్థులు క్లాసులు బాయ్ కాట్ చేసి కాలేజీ ఆవరణలో ఆందోళన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, వార్డు కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి కళాశాలకు వెళ్లి విద్యార్థినులు, ప్రిన్సిపాల్‌తో వేర్వేరుగా చర్చలు జరిపారు. అయితే ప్రిన్సిపాల్ వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగడంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ప్రిన్సిపాల్ వేధింపులపై ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆయనతో వాగ్వాదానికి దిగారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

తాడిపత్రి: స్థానిక మౌర్య పాఠశాలలో శుక్రవారం జరిగిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను ఎంఈఓ నాగరాజు తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా 45 ప్రభుత్వ పాఠశాలల్లోని 3,6,9 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఎంఈఓ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యసాయంపై రైతులతో తెలుసుకుంటున్న అధికారులు

పెద్దపప్పూరు: రసాయన ఎరువుల వాడకంలేకుండా సేంద్రియ ఎరువుల వాడకంతో పండించిన పంటలకు మార్కెట్లోలో డిమాండు ఉందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వరదాయపల్లిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అరటిసాగుచేసిన రైతులు లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటస్వామి, వెంకటరమణలతో సమావేశమయ్యారు. రైతులు ఏ విధంగా సాగు చేస్తున్నారు? తదితర విధానాలను అడిగి తెలుసుకున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆచూకీ లభ్యం

పుట్లూరు: చదువుపై ఇష్టం లేక తాను పాఠశాల నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లినట్లు విద్యార్థిని ఇందు పోలీసులకు తెలిపింది. గురువారం కేజీబీవీ నుంచి ఇంటర్ విద్యార్థిని ఇందు అదృశ్యమైన విషయం విదితమే. పాఠశాల నుంచి బయటకు తప్పించుకపోయిన ఇందు తన చిన్నమ్మ గ్రామమైన గుత్తి మండలం తొండపాడుకు వెళ్లింది. ఆ సమయంలో వారు ఇంటికి తాళం వేసి ఉండటంతో గ్రామంలోని ఆలయం వద్ద ఉన్న విద్యార్థిని ఆలయ పూజారి చూసి వివరాలు సేకరించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.

బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాలి

యాడికి: రైతుల బ్యాంకు ఖాతా వివరాలను ఆర్బీకేల్లో అందజేయాలని ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం వేములపాడులోని ఆర్బీకేలో జరిగిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఏఓ మాట్లాడారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ధాబాల్లో పోలీసుల తనిఖీలు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న ధాబాలను పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ధాబాల్లో మద్యం విక్రయించడంతో పాటు మద్యం సేవించేందుకు అనుమతిస్తే ధాబాలను సీజ్ చేస్తామని అర్బన్ ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

గార్లదిన్నె: కల్లూరు అగ్రహారంలో శనివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డి హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రజా సమస్యలపై పాదయాత్ర

గుంతకల్లుటౌన్: పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం నాయకులు పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద పాదయాత్రను పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు డి.శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. ఈ నెల 6 వరకు పాదయాత్ర నిర్వహించి 7న మున్సిపల్ ఆఫీసు ఎదుట భారీ బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. సీపీఎం నాయకులు మారుతి, నాగరాజు, రంగమ్మ, తిమ్మప్ప, చంద్రశేఖర్, జ్యోతి, వెంకీ, ప్రతాప్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా నిలిపితే వాహనాలు సీజ్ చేస్తాం

తాడిపత్రి అర్బన్: రోడ్డులో అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేస్తే సీజ్ చేస్తామని అర్బన్ సీఐ హమీద్‌ఖాన్, ఎస్ఐ రామక్రిష్ణ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని మెయిన్‌బజార్, పుట్లూరు, యల్లనూరు రోడ్డులో పర్యటించారు. ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా ద్విచక్రవాహనాలను, కార్లను పార్కింగ్

సంక్షిప్త సమాచారం

చేస్తే వాటని సీజ్ చేస్తామని హెచ్చరించారు. దుకాణాల యజమానులు కూడా షాపింగ్ వచ్చే వారికి పార్కింగ్ విషయంలో తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు.

వ్యక్తి బలవన్మరణం

పెద్దవడుగూరు: క్రిష్టిపాడుకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శేషారెడ్డి శుక్రవారం రాయలచెరువులో పురుగుల మందు కొనుక్కొని గ్రామం సమీపంలో తాగి తన ఇంటిలోకి వెళ్లి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతనిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి రెండు నెలల క్రితమే కర్నూలు జిల్లా నల్లమేకలపల్లికి చెందిన సువర్ణతో వివాహమైనట్లు తెలిసింది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

హార్మోనియం అందజేత

పుట్లూరు: స్థానిక రామాలయంలో శుక్రవారం భజన కళాకారులకు హార్మోనియంను ఎంపీపీ బి.రాఘవరెడ్డి అందజేశారు. భూమిరెడ్డి నాల్గవ వర్ధంతి సందర్భంగా భూమిరెడ్డి ఫార్మర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా రూ.70 వేలు విలువ చేసే హార్మోనియంను అందించారు. సొసైటీ సభ్యుడు పెద్దనారాయణరెడ్డి ఉన్నారు.

పట్టపగలే చోరీ

యాడికి: కూర్మాజీపేటలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, బాధితుల వివరాల మేరకు..గ్రామానికి చెందిన కంటా శ్రీనివాసులు, లావణ్య దంపతులు ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం శ్రీనివాసులు ఇంటికి వచ్చి చూడగా వాకిలితోటు బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంటనే క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. నాలుగు తులాల బంగారు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పుట్లూరు: గోపురాజుపల్లి ఎస్సీ కాలనీలో చోరీ జరిగింది. వివరాలు...కాలనీకి చెందిన పెద్దన్న ఇంటిలోకి ప్రవేశించిన దొంగలు రెండు తులాల బంగారు, రూ.30వేలు నగదు అపహరించారు. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.

ముచ్చుకోటలో 104 సేవలు

పెద్దపప్పూరు: ముచ్చుకోటలో శుక్రవారం 104 సంచార వైద్యశాల బృందం సేవలు అందించింది. డా.కళ్యాణ్‌కుమార్ రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. రోగులకు అందించిన వైద్య సేవలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్ వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు

గుంతకల్లు రూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శని, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎల్ఓలు దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి

పామిడి: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత హాజరయ్యారు. మండల మీట్ నామమాత్రంగా నిర్వహిస్తుండడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ సభ దృష్టికి తెచ్చారు. పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ వర్తింపజేయాలని వైస్ ఎంపీపీ కాయల మహేష్ కోరారు. పామిడి–వజ్రకరూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలంటూ సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఎద్దులపల్లిలో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి కరెంట్ సమస్య తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ సుధాకర్‌శర్మ కోరారు. ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత మూడు నెలల్లో అన్ని శాఖలలో జరిగిన ప్రగతి, ప్రతిపాదనలపై చర్చించారు. కరిడికొండ, చెర్లోపల్లి పంచాయతీలో తరచూ విద్యుత్ తీగలు కాలిపోతుండటంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతోందని సర్పంచ్‌లు రమేష్‌బాబు, అప్పా వెంకటేష్ సభ దృష్టికి తెచ్చారు. చిరుధాన్యాల కొనుగోలు కేంద్రాలను గ్రామాల్లో రైతులు కోరితే ఏర్పాటు చేస్తామని ఏఓ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ శివాజీరెడ్డి, వైస్ ఎంపీపీలు తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, ఎంఈఓ రవినాయక్, సర్పంచ్‌లు చిదంబరి, సుశీలమ్మ, రాజేశ్వరి, వాసుదేవరెడ్డి, చిన్న అంజనేయులు, గోపాల్, ఎంపీటీసీలు చిన్న వీరన్నగౌడ్, సుమలత, శంకరమ్మ, కార్యదర్శులు ధనలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు బీసీలు రుణపడి ఉంటారు

గుంతకల్లు రూరల్: కేబినెట్ సమావేశంలో బీసీ కులగణన నిర్ణయాన్ని ఆమోదించడం శుభపరిణామమని, సీఎం జగన్‌కు బీసీలంతా రుణపడి ఉంటారని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ ఈరోజు చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నారని, బీసీల కలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ ఆంధ్ర రైతులను అవమాన పరిచేలా మాట్లాడటం సరైంది కాదని తెలిపారు. తన గొప్పలు చెప్పుకోవడానికి పక్క రాష్ట్రాలపై పడటం సమంజసం కాదని, అదేపని తాము చేస్తే తెలంగాణ రాష్ట్రంలో నాయకులంతా తలకిందులు అయిపోతారని హెచ్చరించారు.

పామిడిలో పోలీసుల పికెటింగ్

పామిడి: స్థానికసంతమార్కెట్‌వీధి (నారాయణస్వామి వీధి)లో శుక్రవారం సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. గురువారంరాత్రి ఇరువర్గాల నడుమ ఘర్షణ జరగడంతో పోలీసులు అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. పరారీలో ఉన్న దొంగ శివ బ్యాచ్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.